వంగవీటి మోహన రంగాకు ఘన నివాళి

పాలకొల్లు సెంట్రల్: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన వ్యక్తి దివంగత నేత వంగవీటి మోహనరంగా అని పలువురు నాయకులు కొనియాడారు. గురువారం స్థానిక మారుతి సెంటర్ వద్ద మోహనరంగా 77వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు రంగా సేవలను కొనియాడారు. రాష్ట్రంలో ఒక జిల్లాకు వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని అలాగే అమరావతి ప్రాంతంలో స్మారకస్థూపం కూడా ఏర్పాటుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గుణ్ణం నాగబాబు, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజులునాయుడు, చేగొండి సూర్యప్రకాష్, అడబాల రమణ, సాలా నర్సయ్య, టీడీపీ నాయకులు అంగర రామ్మోహన్, వల్లభు నారాయణమూర్తి, పెచ్చెట్టి బాబు, కర్నేన గౌరునాయుడు, బోణం నాని, పెనుమాక రామ్మోహన్, జక్కంపూడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రంగా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న గుణ్ణం నాగబాబు, మేకా శేషుబాబు


పెనుగొండలో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ నానాజీ

పెనుగొండలో..

పెనుగొండ: వంగవీటి మోహన్ రంగాకు పెనుగొండ, సిద్ధాంతంల్లో ఘనంగా నివాళులర్పించారు. వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా పెనుగొండలోని పంచాయతీ పార్కు వద్ద విగ్రహానికి డీసీసీబీ డైరెక్టర్ కూనపరెడ్డి లక్ష్మయ్యనాయుడు(నానాజీ) పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ సభ్యుడు చిట్నిడి రాము, కూటమి నాయకులు గుర్రాల సూరిబాబు, కటికిరెడ్డి నానాజీ, మారిశెట్టి భార్గవ, నక్కావేద వ్యాస శాస్త్రి, కానూరి అర్జునరావు, రంగా అభిమానులు ఆసునగరి, బళ్ల మాధవరావు, దుప్పనపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రంగా అందరివాడు

నరసాపురం రూరల్: సమాజంలోని అందరి అభ్యున్నతి కోసం పాటుబడిన మహోన్నత వ్యక్తి వంగవీటి మోహనరంగా అని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. గురువారం మండలంలోని చిట్టవరం, కొప్పర్రు గ్రామాల్లో రంగా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చాగంటి మురళీకృష్ణ, జక్కం బాబ్జి, వంగవీటి పుష్పవల్లి పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి


గ్రంథాలయంలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం


కలగంపూడిలో అల్లూరి జయంతిని నిర్వహిస్తున్న గ్రామస్తులు

పాలకొల్లు సెంట్రల్: స్వాతంత్ర్యం పోరాటంలో గాంధీజీ అహింసా మార్గాన్ని ఎంచుకుంటే అల్లూరి సీతారామరాజు విప్లవ మార్గాన్ని ఎంచుకున్నారని శాఖా గ్రంథాలయాధికారిణి వి.శాంతకుమారి అన్నారు. గురువారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వి.శాంతకుమారి మాట్లాడుతూ విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు మన జిల్లావాసి కావడం గర్వకారణమన్నారు. అల్లూరి చూపించిన స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు కేవీవీ సత్యనారాయణ, వార్డు సెక్రటరీ గోపాలస్వామి, దుర్గ, పూజిత, నందిని, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కలగంపూడిలో యువత రక్తదానం

యలమంచిలి: మన్యం ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్ష రగిల్చి వారితో కలసి బ్రిటీష్ ప్రభుత్వంపై అలుపెరుగని పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని వైఎస్సార్ సీపీ నాయకుడు పొత్తూరి బుచ్చిరాజు అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా కలగంపూడి గ్రామంలో ఉన్న అల్లూరి విగ్రహానికి గురువారం బుచ్చిరాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శనీయం కావాలన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 30 మంది యువకులు రక్తదానం చేశారు. నరసాపురం పట్టణానికి చెందిన రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు దాతల నుంచి రక్తాన్ని సేకరించారు.

క్షత్రియ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో..

పాలకొల్లు అర్బన్: పీడిత వర్గ ప్రజల విముక్తి కోసం బ్రిటీష్ సైన్యంతో పోరాటం చేసిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలో మన్యం వీరుడు, విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలు క్షత్రియ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సంక్షేమ పరిషత్ కల్యాణ మండపం వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్షత్రియ కల్యాణ మండపంలో వలంటరీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా డాక్టర్ లక్ష్మీపతిరాజు రక్తదానం చేశారు. సుమారు 20 మందికి పైగా రక్తదానం చేశారు. అనంతరం గాంధీబొమ్మల సెంటర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు భూపతిరాజు విశ్వనాథరాజు, కార్యదర్శి డా.కేఎస్‌పీఎన్ వర్మ, ఉపాధ్యక్షుడు కనుమూరి రామకృష్ణంరాజు, వేగేశ్న రంగరాజు, కలిదిండి రామరాజు, కేవీ కృష్ణవర్మ, పెన్మెత్స బుద్ధరాజు, పెన్మెత్స జగపతిరాజు తదితరులు పాల్గొన్నారు.


పాలకొలులో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

విద్యా సామగ్రి అందజేత

యలమంచిలి: నారినమెరక పంచాయతీ గమళ్లపెంటలో ఒకటి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రంలోని బాలలకు గ్రామానికి చెందిన యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బొర్రా గోపీమూర్తి సుమారు రూ.10 వేలు విలువ చేసే నోటు పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రి అందజేశారు. వాటిని యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకుల చేతుల మీదుగా గురువారం విద్యార్థులకు వీటిని అందించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు మాట్లాడుతూ గోపీమూర్తి పేద విద్యార్థులకు 2007 నుంచి క్రమం తప్పకుండా నోటు పుస్తకాలు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వలవల విష్ణు బాలాజీ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పోలిశెట్టి క్రాంతి కుమార్, మండల శాఖ అధ్యక్షుడు గుత్తిందీవి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పంతం రామ్మూర్తినాయుడు, కోశాధికారి వి.సందీప్‌కుమార్, దొడ్డిపట్ల హైస్కూల్ హెచ్ఎం రామేశ్వరపు సత్యనారాయణ పాల్గొన్నారు.


నారినమెరకలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నారుమడులు మునగకుండా చర్యలు తీసుకోవాలి

పాలకొల్లు అర్బన్: అధిక వర్షాల కారణంగా నారుమడులు, నాట్లు వేసిన వరిచేలు ముంపునకు గురికాకుండా ముందుస్తు చర్యలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు అధికారులకు ఆదేశాలిచ్చారు. పాలకొల్లు మండలంలోని రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. పీఎం కిసాన్ భౌతిక తనిఖీ విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే గ్రామంలో ఏపుగా పెరిగిన వరినారుమడులను పరిశీలించారు. ఆరోగ్యకరమైన వరినారును రైతులు వరినాట్లుగా వేసుకోవాలని సూచించారు. అధిక వర్షాల కారణంగా ముంపు బారిన పడ్డ నారుమడులు ఏమీ లేవన్నారు. అలాగే వరినారుమడులు ముంపు బారిన పడకుండా పంట కాలువల్లోనూ, డ్రెయినేజీల్లో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క పూడికలను తొలగించాలని సూచించారు. ఆయన వెంట ఏడీఏ అద్దాల పార్వతి, వ్యవసాయాధికారి ఎం.సామ్యూల్ జాన్సన్, జిల్లా సాంకేతిక వ్యవసాయాధికారి బీఆర్ ప్రియదర్శిని, ఏఈఓ కె.ప్రవీణ్, వీఏఏ డి.నరేంద్రకుమార్, భరత్ పాల్గొన్నారు.


లంకలకోడేరులో నారుమడులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

ముద్ద వాపు చర్మ వ్యాధి టీకాల పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో గురువారం ఆవులకు ముద్ద వాపు చర్మ వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వమించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పోతుల అన్నవరం మాట్లాడుతూ పాడి రైతులు ముద్ద వాపు చర్మ వ్యాధి సోకకుండా ముందస్తు టీకాలు వేయించాలన్నారు. మండల పశువైద్యాధికారి టీవీ.విజయ్‌కుమార్, ఎమ్పీటీసీ పి.సత్యనారాయణ, గోపాల మిత్ర బుజ్జియ్య, పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.


పెదతాడేపల్లి గ్రామంలో ఆవులకు టీకాలు వేస్తున్న దృశ్యం

తాగునీటి పరిరక్షణకు చర్యలు

పెంటపాడు: నియోజకవర్గంలో తాగునీటి పరిరక్షణకు అధికారులు నడుం బిగించారు. వర్షాకాలం ప్రారంభం దృష్ట్యా డెల్టాలో పలు గ్రామాల్లో చెరువులు కలుషితమయ్యాయి. అయితే ఈ విషయాన్ని ఇటీవల అధికారుల రివ్యూ సమావేశంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తాగునీటి వల్ల రోగాలు ప్రబలకుండా ప్రధానంగా తాగునీటి చెరువుల ప్రక్షాళనకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సూచనలు చేయడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, వైద్య సిబ్బంది స్పందించారు. దీంతో పసర్లు దేరిన విప్పర్రు భారీ చెరువు నీటి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపినట్లు పెంటపాడు వైద్యాధికారి తోట రాజేష్ తెలిపారు. అదే విధంగా ప్రత్తిపాడు గ్రామంలో గత కొద్దిరోజులుగా తాగునీటి ప్రక్షాళనకు చర్యలు తీసుకొంటున్నారు. రెండు రోజుల నుంచి ముగ్గు చల్లించి క్రిమి కీటకాలు చేరకుండా అధికారులు చర్యలు తీసుకొన్నారు. అదే విధంగా యానాలపల్లి, కె. పెంటపాడు, వల్లూరుపల్లి పలు గ్రామాల చెరువులు కలుషితం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

విద్యాసంస్థల బంద్ ప్రశాంతం

నరసాపురం: నరసాపురంలో గురువారం విద్యాసంస్థల బంద్ కార్యక్రమం విజయవంతమయ్యింది. నీట్ పరీక్షలో లోపాలు ఇతర విద్యా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్తంగా చేపట్టిన బంద్‌లో భాగంగా నరసాపురంలో కళాశాలలు, పాఠశాలలు బంద్ పాటించాయని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు డి.అనిల్‌బాబు చెప్పారు. విద్యార్థి సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించి బంద్ చేయించారు. ఒకరోజు ముందుగా నోటీసులు ఇవ్వడంతో పలు ప్రైవేట్ విద్యాసంస్థలు ముందుగానే సెలవు ప్రకటించాయి.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: నీట్ పరీక్ష పేపర్ లీక్‌పై నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పాలకొల్లు పట్టణంలో పాలకొల్లు నియోజకవర్గంలో ఎస్ఎఫ్ఐ, ఎస్ఏఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. నియోజకవర్గంలోని పాలకొల్లు పట్టణం, పోడూరు, యలమంచిలి, పాలకొల్లు మండలాల్లో విద్యాసంస్థలను బంద్ పాటించారు. రాష్ట్ర పరిధిలోనే నీట్ పరీక్షలు నిర్వహించాలని నాయకులు కోరారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కన్వీనర్ శేఖర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుందర్, సహాయ కార్యదర్శి పులపర్తి కుమార్, సంఘ నాయకులు యలమల సంతోష్, యామిని తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌యూ ఆధ్వర్యంలో...

ఆల్ ఇండియా స్టుడెంట్స్‌యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. కొన్ని గ్రామాల్లో మధ్యాహ్నం భోజనం పూర్తయిన అనంతరం పాఠశాలలను మూసివేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కె సాయిమనోజ్, సంఘ నాయకులు రాజా, సన్నీ, యు బ్లెస్సీ శేఖర్, రాంప్రసాద్, ఖండవల్లి రమేష్, టి.రాము పాల్గొన్నారు.


పాఠశాలల బంద్ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు


పాలకొల్లులో విద్యాసంస్థల బంద్‌లో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ, ఎస్ఏఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు

రేపటి నుంచి ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు


గొట్టుముక్కల నీలిమ

మొగల్తూరు: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా శనివారం పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నామని వెటర్నరీ డాక్టర్ గొట్టుముక్కల నీలిమ గురువారం విలేకరులకు తెలిపారు. స్థానిక వెటర్నరీ ఆసుపత్రిలో ఉదయం నుంచి పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి సోకకుండా ఉచితంగా టీకాలు వేస్తామని వివరించారు. మండలంలోని పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పెనుగొండలో..

పెనుగొండ: జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం అన్ని పశువుల ఆసుపత్రుల్లో కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు పెనుగొండ, మార్టేరు సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.ప్రమీలా రాణి, డాక్టర్ వి.ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. పశు వైద్య శాలలతో పాటు, రైతు సేవా కేంద్రాల వద్ద కూడా టీకాలు వేస్తామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

డిగ్రీ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభం

పెంటపాడు: పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 సంవత్సరానికి గాను డిగ్రీలో చేరేందుకు అడ్మిషన్‌లు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ హానర్స్, బీఎస్సీ హానర్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, జువాలజీ మేజర్, మాథ్స్‌మేజర్, కెమిస్ట్రీ మేజర్, ఎకనామిక్స్‌మేజర్‌లో చేరేగోరే విద్యార్థులకు సీట్లు ఉన్నాయన్నారు. విద్యార్థులు కళాశాల సహాయక కేంద్రాలతో పాటు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

క్షీరారామలింగేశ్వరుని సన్నిధిలో రుద్రహోమం


రుద్రహోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం రుద్రహోమం నిర్వహించారు. ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో నిర్వహించిన ఈ రుద్రహోమంలో 15 మంది దంపతులు పాల్గొన్నారు. హోమం అనంతరం భక్తులకు స్వామివారి శేషవస్త్రం, మహిళలకు జాకెట్ ముక్కలు, ప్రసాదం అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముత్యాల శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మేడపాడు శివాలయంలో మాస శివరాత్రి


ప్రత్యేకాలంకరణలో ఉమా రామలింగేశ్వరస్వామి

యలమంచిలి: మాస శివరాత్రి సందర్భంగా గురువారం మేడపాడు శివాలయంలో ఆలయ అర్చకులు బాదంపూడి చిరంజీవి శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. భక్తుల సహకారంతో పూలతో పార్వతీ పరమేశ్వరుల మూల విరాట్టులను సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య


విద్యార్థులకు విద్యా కిట్లు అందజేస్తున్న ఎంఈఓ వీరాస్వామి

పాలకొల్లు సెంట్రల్: ప్రతి విద్యార్థికీ మెరుగైన విద్యాబోధన ప్రభుత్వ పాఠశాలలో అందుతుందని మండల విద్యాశాఖాధికారి–2 గుమ్మళ్ల వీరాస్వామి అన్నారు. గురువారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా స్థానిక ఎస్ఏఎస్ఎన్ మునిసిపల్ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులను జాయిన్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ వీరాస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. విద్యతో పాటు ప్రభుత్వం అందించే అనేక సంక్షేమఫలాలు విద్యార్థులకు ఎంతగానో దోహదపడతాయన్నారు. 3,4,5 తరగతులకు చెందిన ముగ్గురు విద్యార్థులను చేర్పించుకుని విద్యాకిట్లను అందించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎ.విజయదుర్గ, వి.స్వాతి, టి.జనార్దన్, రాజేశ్వరి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీఎస్‌పై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీఎస్ అధికారి శ్రీనివాసరావు

నరసాపురం రూరల్: ఆదాయపు పన్ను శాఖ నిర్దేశించిన ప్రకారం మినహాయించిన టీడీఎస్ మొత్తాన్ని సకాలంలో ప్రభుత్వానికి జమ చేయాలని టీడీఎస్ అధికారి శ్రీనివాసరావు, వాణిజ్య పన్నులశాఖ అధికారులు ఎస్.శ్రీనివాసరావు, ఆర్.శ్రీరామచంద్రమూర్తి అన్నారు. మండలంలోని సీతారామపురంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం కాంట్రాక్టర్లు, వ్యాపారులకు, ఆదాయపు పన్నుశాఖ ఆధ్వర్యంలో టీడీఎస్ పై అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదాయపుపన్ను శాఖ టాక్స్ డిడాక్టడ్ సోర్సు (టీడీఎస్) నిబంధనను అనుసరించి చెల్లింపులు జరిపే ముందు పాన్, టిన్ నెంబర్లు క్షుణ్ణంగా పరిశీలించి తదుపరి ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యాపారులు, వర్తక సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ డ్రాయింగ్ ఆఫీసర్లు తెలిపిన సమస్యలను అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, ట్రెజరర్ కేవీ సత్యనారాయణ, డైరెక్టర్ అద్దాల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

18న సైన్స్ టాలెంట్ టెస్ట్

తాడేపల్లిగూడెం (టీటీసీ): తాడేపల్లిగూడెం, ఉంగుటూరు నియోజకవర్గం స్థాయిలో జిల్లా విద్యాశాఖ అధికారుల అనుమతితో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌లో పదో తరగతి చదువుతున్న బాల బాలికలకు భారత శివశక్తి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆత్మబంధువులం సేవా సంఘ సభ్యులు తెలిపారు. సేవా సంఘం వారిచే ఈ నెల 18వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు మాగంటి సీతారామదాసు కల్యాణ మండపంలో టెస్ట్ జరుగుతుందన్నారు.

రేపటి నుంచి మోళ్లపర్రులో వారాహి నవరాత్రులు

మొగల్తూరు: మోళ్ళపర్రు కనకదుర్గ బీచ్‌లో ఉన్న దశావతార సహిత మత్స్యనారాయణ స్వామి, అష్టలక్ష్మీ సమేత ఆదిలక్ష్మి అమ్మవార్ల ఆలయంలో శనివారం నుంచి 16 వరకు వారాహి నవరాత్రుల కార్యక్రమం నిర్వహించనున్నారు. గురువారం నిర్వాహకులు విలేకరులతో మాట్లాడుతూ నక్షత్ర దోషాలు, కార్యసిద్ధి దుష్టగహ నివారణకు ప్రతి రోజూ విశేషార్చనలు నిర్వహిస్తారన్నారు. ఆఖరి రోజైన 16న ఉదయం నుంచి శాంతి హోమం, పూర్ణాహుతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

అభివృద్ధికి అండగా ఉంటా


ఇసుక గరువులో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి

పెనుగొండ: మండలంలో అభివృద్ధికి అండగా ఉంటానని ఆచంట ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి అన్నారు. ఆచంట మండలం పెనుమంచిలి ఇసుక గరువు ఎంపీపీ స్కూలులో రూ.2లక్షల నిధులతో చేసిన అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గణేశుల శేషవేణి సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గెయిల్ ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్షోత్సవాలు


ఆర్లపాడులో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న గెయిల్ అధికారులు

యలమంచిలి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే సగం రోగాలను అరికట్టవచ్చని గెయిల్ ఇండియా లిమిటెడ్ తాటిపాక ఇన్‌చార్జి కె.రాంబాబు అన్నారు. గెయిల్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు స్వచ్ఛత పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ క్రమంలో గెయిల్ యూనిట్స్ ఉన్న గ్రామాల్లోమెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. గురువారం యలమంచిలి మండలంలోని ఏనుగువానిలంక గెయిల్ టెర్మినల్ పరిధిలోని చించినాడ పంచాయతీ ఆర్లపాడులో మెడికల్ క్యాంపు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


అవగాహనా ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

నరసాపురం: సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సూచించారు. గురువారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలో సీజనల్ వ్యాధులపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం దృష్ట్యా సీజనల్‌గా జ్వరాలు వస్తాయన్నారు. డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త పడాలని చెప్పారు. మున్సిపల్ చైర్పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి పని చేస్తున్నామన్నారు. వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామని వివరించారు. మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ ఆర్.రమేష్‌బాబు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

తాడేపల్లిగూడెం (టీటీసీ): కాచి చల్లార్చిన నీటినే తాగాలని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.సూర్యనారాయణ, మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావులు పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణకు మార్గమని గురువారం ఏరియా ఆస్పత్రి వద్ద అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు.